క్లుప్తంగా

నేడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నామినేషన్

నల్లగొండ : నల్లగొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం నామినేషన్ పత్రాలు దాఖలు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు వెంకటేశ్వర కాలనీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నామినేషన్ పత్రాలతో పూజలు చేసిన తర్వాత భారీ ర్యాలీగా ఆర్‌ఓ కార్యాలయానికి చేరుకుంటారు. అనంతరం ఆయన నామినేషన్ పత్రాలు సమర్పించనున్నారు.

గణితంపై ఉచిత శిక్షణ

నకిరేకల్ : దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో మాస్టర్స్ చదవడం కోసం ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు గణితంపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గణిత విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో ఫిబ్రవరిలో నిర్వహించే ఐఐటీ జామ్(జాయింట్ అడ్మిషన్ ఫర్ మాస్టర్స్), సెంట్రల్ యూనివర్సిటీ ప్రవేశ పరీక్ష కోసం ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులకు ప్రతిరోజు సాయంత్రం 7 నుంచి 9 గంటల వరకు తరగతులు నిర్వహిస్తూ మోడల్ టెస్ట్ సిరీస్ నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9701275354 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నోటుకు ఓటు అమ్ముకోవద్దు

నల్లగొండ టౌన్ : భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన ఓటును ఎట్టి పరిస్థితుల్లోనూ నోటుకు అమ్ముకోవద్దని నల్లగొండ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని బీట్ మార్కెట్ సముదాయంలో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రలోభాలకు లొంగకుండా ప్రజా సేవ చేసే నిస్వార్థమైన నాయకుడికి ఓటు వేసి ప్రజాప్రతినిధిగా ఎన్నుకోవాలన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీలో ఉంటున్నానని, తనకు ఓటు వేసి గెలిపించాలని చొల్లేటి ప్రభాకర్ కోరారు.

ఎంసీఎంసీ కేంద్రం సందర్శన

నల్లగొండ: జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) కేంద్రాన్ని సోమవారం ఎన్నికల వ్యయ పరిశీలకుడు సంతోష్‌కుమార్ సందర్శించారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. సోషల్ మీడియా మానిటరింగ్, ఎలక్ట్రానిక్ మీడియా మానిటరింగ్, ఎంసీఎంసీ కమిటీ పనితీరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. 1950 టోల్ ఫ్రీ నంబర్, సీ-విజిల్ యాప్‌కు వచ్చిన ఫిర్యాదులు ఏ విధంగా పరిష్కరిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మీడియా నోడల్ అధికారి కోటేశ్వరరావు, సహాయ సంచాలకుడు పి.శ్రీనివాస్, కేంద్ర సమాచార శాఖ ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి జి.కోటేశ్వరరావు, డీఐఓ గణపతిరావు ఉన్నారు.

ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా శ్రీనివాస్‌రెడ్డి



మునుగోడు : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా నారాయణపురం మండలం గుజ్జ గ్రామానికి చెందిన దోడ శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. సోమవారం శ్రీనివాస్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ నియామక పత్రం అందజేశారు.

తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీఐ

చండూరు : ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో పగడ్బందీగా తనిఖీలు చేపట్టాలని సీఐ వెంకటయ్య అన్నారు. ఉడతలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల్లో నగదు, మద్యం తరలింపుపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు.

ఘనంగా మడేలయ్య బోనాలు



బోనాలు తీసుకెళ్తున్న గ్రామస్తులు

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ మండలం అంతంపేట గ్రామంలో సోమవారం మడేలయ్య బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు డప్పుచప్పుళ్లతో మడేలయ్య ఆలయానికి చేరుకుని బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరికోతలు

- వరికోత యంత్రాలకు పెరిగిన డిమాండ్
- మూసీ పరీవాహక ప్రాంతంలో తుది దశకు వరి కోతలు



శాలిగౌరారం ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో వరి చేను కోయిస్తున్న రైతు

శాలిగౌరారం: మండలంలో వానాకాలం వరికోత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. 20 రోజుల క్రితం ప్రారంభమైన వరికోతలు ఈ నెలాఖరు వరకు కొనసాగనున్నాయి. శాలిగౌరారం మండలంలో నాన్ ఆయకట్టులో ఇప్పటికే వరికోతలు ముగింపు దశకు చేరుకోగా ఆయకట్టులో ఇప్పుడిప్పుడే జరుగుతున్నాయి.

19,300 ఎకరాల్లో వరి సాగు

వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం శాలిగౌరారం మండలంలో వానాకాలం సీజన్‌లో మొత్తం 19,300 ఎకరాల్లో (7720 హెక్టార్లు) వరి పంటను రైతులు సాగుచేశారు. అందులో 70–80 శాతం దొడ్డురకం కాగా 20–30 శాతం సన్నరకాలను సాగుచేశారు. ప్రస్తుతం దొడ్డు రకాలు కోతలు జరుగుతుండగా సన్నరకాలకు మరో రెండు వారాల సమయం పట్టనుంది. దొడ్డు రకాల వరిధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుండడంతో రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు.

శాలిగౌరారం ప్రాజెక్టు కింద 5వేల ఎకరాల సాగు

మండలంలోని శాలిగౌరారం ప్రాజెక్టు ఆయకట్టు కింద శాలిగౌరారం, తిరుమలరాయునిగూడెం, రామగిరి, శాలిలింగోటం, అంబారిపేట, గురుజాల, తుడిమిడి, అడ్లూరు, ఊట్కూరు, బండమీదిగూడెం గ్రామాల పరిధిలో సుమారు 5వేల ఎకరాలకు సాగునీరందడంతో రైతులు వరిపంటను సాగుచేశారు. అదేవిధంగా నాన్‌ఆయకట్టుగా ఉన్న భైరవునిబండ, తక్కెళ్లపహాడ్, ఆకారం, వల్లాల, పెర్కకొండారం గ్రామాలతో పాటు మూసీనది పరీవాహక ప్రాంతాలుగా ఉన్న ఉప్పలంచ, మనిమద్దె, గురుజాల, తుడిమిడి, చిత్తలూరు, వంగమర్తి, ఇటుకులపహాడ్ గ్రామాల రైతులు మూసీనదిలోని ఇసుక బోర్ల ద్వారా వరిపంటను సాగుచేశారు. నాన్‌ఆయకట్టు గ్రామాలతోపాటు మూసీనది పరీవాహక ప్రాంతాల్లో వానాకాలం సీజన్‌లో ముందస్తుగా వరిపంట సాగు కావడంతో ఆయా గ్రామాల్లో వరికోతలు తుదిదశకు చేరుకున్నాయి. శాలిగౌరారం ప్రాజెక్టు కింద వానాకాలం పంటకు ఆలస్యంగా సాగునీటి విడుదల కావడంతో వరికోతలు ఇప్పుడే ముమ్మరస్థాయికి చేరుకున్నాయి. దీంతో వరికోత యంత్రాలకు డిమాండ్ ఏర్పడింది.

1.50 లక్షల క్వింటాళ్లు కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నాం

మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఆయా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 1.50 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకోసం సిబ్బందిని కూడా సమాయత్తం చేశాం.

– ఆంజనేయులు, పీఏసీఎస్ సీఈఓ, శాలిగౌరారం

సీపీఎంకు పూర్వ వైభవం తీసుకురావాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు



మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

నకిరేకల్ : నకిరేకల్‌లో సీపీఎం అభ్యర్థిని గెలిపించి పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు కోరారు. నకిరేకల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం జరిగిన సీపీఎం నియోజకవర్గ స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తి సీపీఎం నకిరేకల్ అభ్యర్థి బొజ్జ చినవెంకులు అని పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ చినవెంకులు, నాయకులు మేక అశోక్‌రెడ్డి, బొంతల చంద్రారెడ్డి, జిట్టా నగేష్, అవిశెట్టి శంకరయ్య, రాచకొండ వెంకట్ గౌడ్, పెంజర్ల సైదులు, జిల్లాల పెంటయ్య, వంటిపాక వెంకటేశ్వర్లు, కల్లూరి యాదగిరి, చెరుకు సైదులు, మల్లం మల్లేష్, బోళ్ల నర్సింహారెడ్డి, వంటిపాక కృష్ణ, మర్రి వెంకటయ్య, ఏర్పుల తాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షానికి తడిసిన ధాన్యం



కేతేపల్లిలో అకాల వర్షానికి తడిసిన ధాన్యం

కేతేపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కురిసిన అకాల వర్షానికి ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి ధాన్యం రాశులు తడిసి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవల వరి కోతలు ప్రారంభించిన రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చారు. ధాన్యంలో తేమశాతం తగ్గించేందుకు ఆయా కేంద్రాలతోపాటు సర్వీసు రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టారు. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో ఆరబెట్టిన ధాన్యంపై రైతులు పట్టాలు కప్పే ప్రయత్నం చేశారు. అయితే వర్షం జోరుగా కురవడంతో ధాన్యం తడిసిపోయింది. ధాన్యం తడిసిపోవడంతో కాంటాలు వేయాలంటే మరో వారం రోజులపాటు ఆరబెట్టాల్సి ఉంటుందని రైతులు వాపోతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నల్లగొండ రూరల్ : కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి కాంగ్రెస్ నాయకుడు కొప్పుల రాంరెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. రాంరెడ్డి మృతదేహాన్ని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, చెన్నారం సర్పంచ్ ఉప్పునూతల వెంకన్న యాదవ్, అనంతారం మాజీ సర్పంచ్ వజ్జె సత్యనారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎంపీ కోమటిరెడ్డి

కొనసాగుతున్న నామినేషన్ల ప్రక్రియ



నామినేషన్ పత్రాలను ఆర్‌ఓకు అందజేస్తున్న కర్నాటి వెంకటయ్యగౌడ్



పిల్లి రామరాజు తరపున నామినేషన్ దాఖలు చేస్తున్న సోదరుడు కృష్ణంరాజు

నల్లగొండ : నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గానికి సోమవారం ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి పిల్లి రామరాజుయాదవ్ తరపున రెండోసారి ఆయన సోదరుడు కృష్ణంరాజు నామినేషన్ సమర్పించారు. నామినేషన్ మొదటి రోజైన 3వ తేదీన పిల్లి రామరాజు తరపున నామినేషన్ పత్రాన్ని కృష్ణంరాజు సమర్పించిన విషయం తెలిసిందే. మరలా రెండోసారి కూడా ఆయన సోదరుడే నామినేషన్ సమర్పించారు.

మునుగోడులో ముగ్గురు అభ్యర్థులు..

చండూరు : ఈ నెల 30న జరగనున్న మునుగోడు నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికలకుగాను చండూరు ఆర్‌ఓ కార్యాలయంలో మూడోరోజు ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లను ఆర్‌ఓ దామోదర్‌రావుకు సమర్పించారు. కర్నాటి వెంకటయ్యగౌడ్ (మర్రిగూడ మండలం దామెర భీమనపల్లి) సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా, కిన్నెర యాదయ్య (కొండమల్లేపల్లి మండలం కొల్‌ముంతల పహాడ్ గ్రామం) స్వతంత్ర అభ్యర్థి, నర్రి స్వామి (నారాయణపూర్ మండలం మల్లారెడ్డిగూడెం) స్వతంత్ర అభ్యర్థి నామినేషన్లను దాఖలు చేశారు. ఇప్పటి వరకు 11 మంది 11 నామినేషన్లు వేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం

మర్రిగూడ : మండల పరిధిలోని కుదాబక్షపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మిర్యాల పద్మ ఆధ్వర్యంలో సోమవారం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పద్మ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విష్ణుశ్వరి, విజయ, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తున్న సూపర్‌వైజర్ పద్మ

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు వర్క్‌షాప్

రామగిరి(నల్లగొండ): తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో 120 మంది వలంటీర్లకు ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్.ఉపేందర్ మాట్లాడుతూ శిక్షణ పొందిన వలంటీర్లు ఈ నెల 18 నుంచి ఆయా పాఠశాలలకు వెళ్లి విద్యలో వెనుకబడిన విద్యార్థులకు తగిన నైపుణ్యాలను బోధించనున్నట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఈ.యాదగిరిరెడ్డి, .వెంకట్‌రెడ్డి,ఎస్.యాదగిరి, ఎన్.వేణు, కె.శివరాణి, లైబ్రేరియన్ డాక్టర్ ఏ.దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం

శాలిగౌరారం : మండలంలోని మాధారంకలాన్ గ్రామంలో గల టీఆర్‌ఆర్ కాటన్‌మిల్లులో సోమవారం సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని సోమవారం శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి చీనానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలో ప్రభుత్వం క్వింటాలు పత్తికి రూ. 7020 మద్దతు ధర అందిస్తుందన్నారు. రైతులు నాణ్యమైన పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలని కోరారు. పత్తిలో తేమశాతం 8 నుంచి 12 వరకు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. రైతుల ప్రయోజనం కోసం ఏర్పాటైన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సీసీఐ కేంద్రానికి మొదటగా పత్తి విక్రయించిన రైతుకు బిల్లును ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో కాటన్‌మిల్ యజమాని జోజిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



పత్తి బిల్లును అందజేస్తున్న వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి చీనానాయక్

బీఆర్‌ఎస్‌లో చేరిక

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని 37వ వార్డుకు చెందిన నడింపల్లి సాయి తేజ ఆధ్వర్యంలో 37, 29, 36, 38, 39వ వార్డుల్లోని కాంగ్రెస్ పార్టీకి చెందిన 300 మందికి పైగా యువకులు సోమవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. బొర్ర సుధాకర్, పాటి నర్సిరెడ్డి, నడింపల్లి సాయి తేజ, బంటు సంతోష్‌కుమార్, మహేందర్ రెడ్డి వంశీకృష్ణ, కళ్లెపురం కిరణ్‌కుమార్, శివకుమార్, మహర్షి శివారెడ్డి తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు.

నార్కట్‌పల్లిలో..

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి పట్టణంలోని ఏకలవ్య (ఎరుకల) సంఘం నుంచి 70 కుటుంబాలు నకిరేకల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, ఎంపీటీసీ దుబ్బాక పావని శ్రీధర్, నడింపల్లి మహేష్ తదితరులు ఉన్నారు.

కట్టంగూర్‌లో..

కట్టంగూర్ : మండలంలోని అయిటిపాముల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సోమవారం ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో నకిరేకల్‌లో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, బెల్లి రవి తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో చిలుముల రామస్వామి, బర్రె సైదులు, వైకుంఠ శ్రీను, సైదులు, దాసరి మారయ్య, బర్రె ఎల్లయ్య, బొల్లేపల్లి వెంకన్న తదితరులు ఉన్నారు.

బీజేపీలో చేరిక

చండూరు : మండలంలోని నెర్మట, ఉడతలపల్లి గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీజేపీ నాయకుడు చలమల్ల కృష్ణారెడ్డి సమక్షంలో సోమవారం బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోమటి వీరేశం, పార్టీ సీనియర్ నాయకులు జనార్దన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, ఆంజనేయులు, సత్యం తదితరులు ఉన్నారు. బీజేపీలో చేరిన వారిలో కుమార్, ఓర్సు రాజు, గంగయ్య, నరసింహ, యాదయ్య మన్యం శ్రీను, కట్ట నాగరాజు, పరమేష్, శివాజీ, ప్రభాకర్ లింగస్వామి నాగరాజుతోపాటు మరికొందరు ఉన్నారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

నార్కట్‌పల్లి : మండలంలోని చిన్న నారాయపురం, నార్కట్‌పల్లి గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరినవారిలో నార్కట్‌పల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ దూదిమెట్ల స్రవంతి వెంకటేశ్వర్లు, సామ కొండల్ రెడ్డి, పుల్లెంల శ్రీను, సాంబశివరావుతోపాటు 20 కుటుంబాలు, చిన్ననారాయణపురం గ్రామానికి చెందిన ఊదరి లింగయ్య, దాసరి భిక్షం, సోపరి లింగస్వామి, వంగూరి లింగయ్య, యాస మోహన్‌రెడ్డి, గుండెబోయిన పరమేష్, బొబ్బలి నర్సింహ, దాసరి యాదయ్యతోపాటు మరో 20 కుటుంబాలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, మాజీ జెడ్పీటీసీలు అల్లుబెల్లి రవీందర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, ఎంపీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఐతరాజు యాదయ్య, జేరిపోతుల భరత్, ప్రజ్ఞాపురం సత్యనారాయణ, వెంకన్న, సమద్ తదితరులు ఉన్నారు.

మునుగోడు : బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా యువజన నాయకుడు జడిగం అమర్ ఆ పార్టీకి రాజీనామా చేసి సోమవారం కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా అమర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ విధానాలు, స్థానిక ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి విధానాలు నచ్చక కాంగ్రెస్‌లో చేరానని తెలిపారు.

చిట్యాలలో..

చిట్యాల : మండలంలోని పెద్దకాపర్తి గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఆదివారం రాత్రి భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరినవారిలో ఆ గ్రామ ఉప సర్పంచ్ నూతి సత్యశ్రీ వెంకటేశం, మాజీ ఎంపీటీసీ ఓర్సు లక్ష్మమ్మ యాదయ్య, వార్డు సభ్యులు గుండెపురి చంద్రయ్య, తోటకూరి లక్ష్మమ్మ, చేపూరి భవానిబాబురావు, ఎస్ఎంసీ వైస్ చైర్మన్ నీలకంఠం నరేష్, తొల్సూరి సైదులుతోపాటు మరికొందరు ఉన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు కందిమళ్ళ శిశుపాల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నీలకంఠం లింగస్వామి పాల్గొన్నారు.

ఆధునిక సాగుతో అధిక దిగుబడులు

- ఎకరంలో మూడు పంటలు సాగు
- ఒక పంటకు వచ్చే ఆదాయంతో మిగతా రెండు పంటలకు పెట్టుబడి
- వన్ టైం త్రీ క్రాప్స్ పద్ధతితో అధిక ఆదాయం పొందుతున్న రైతు



వినూత్న పద్ధతిలో సాగు చేసిన కంది, పత్తి, బెండ పంటలు



పూత దశలో పత్తి చేను



కాత దశలో ఉన్న బెండ చేను

మునుగోడు : కొందరు రైతులు పాత పద్ధతిలో పంటలు సాగుచేస్తూ అంతంత మాత్రంగా దిగుబడి పొందుతుండగా మరి కొంత మంది రైతులు మాత్రం వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అవలంబిస్తూ అధిక దిగుబడి, ఆదాయం పొందుతున్నారు. మునుగోడు మండలంలోని చల్మెడ గ్రామానికి చెందిన నెల్లికంటి రాఘవేంద్ర అనే రైతు ఈ ఏడాది వన్ టైం త్రిక్రాప్స్ పద్ధతిలో పంటలు సాగు చేసి అధిక ఆదాయం పొందుతున్నారు. గతంలో అనేక రకాల పంటలను సాగు చేసి ఆదర్శ రైతుగా గుర్తింపు తెచ్చుకున్నారు.

కందిలో పత్తి, బెండ పంటల సాగు..

నెల్లికంటి రాఘవేంద్ర తనకున్న ఏడెకరాల వ్యవసాయ భూమిలో మూడెకరాల్లో కంది, రెండెకరాల్లో పత్తి, ఒక ఎకరంలో కంది, పత్తి, బెండ పంటలను సాగు చేశాడు. మూడు పంటల సాగుకు జూన్ మాసంలో విత్తనాలను ఒకేసారి వేశాడు. అందులో కంది సాళ్ల మధ్య 6 ఫీట్ల వెడల్పు భూమిని వదిలి 18 ఇంచుల వెడల్పులో బెండ, మరో 32 ఇంచుల వెడల్పులో పత్తి చేను సాగు చేశాడు. ఇందులో బెండ చేను 30 రోజుల నుంచి దిగుబడి రావడంతో రోజుకు సగటున రూ. 600 నుంచి రూ. 800 చొప్పున 30 రోజుల పాటు ఆదాయం పొందాడు. ఆ ఆదాయంతో పత్తి, కంది పంటలకు అవసరమైన ఎరువులను కొనుగోలు చేసి పెట్టుబడి పెట్టాడు. 90 రోజుల తరువాత పత్తి పంట దిగుబడి వచ్చింది. ఇప్పటి వరకు 5 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చింది. కంది పంట పూత దశలో ఉంది. కంది మరో నెల రోజుల్లో చేతికి వస్తుందని, కంది దాదాపు 10 క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుందని రైతు చెబుతున్నాడు. ఇలా ఒకేసారి మూడు పంటలను సాగుచేయడంతో నిత్యం ఆదాయం రావడంతోపాటు పెట్టుబడి భారీగా తగ్గుతుందని రైతు చెబుతున్నాడు. ఈ విషయం తెలిసిన చుట్టు పక్కల గ్రామాల రైతులు నెల్లికంటి రాఘవేంద్ర సాగు విధంగా పంటలు కొనసాగించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

నిరంతరం ఆదాయం వస్తోంది

నేను సాగుచేసిన వన్ టైం త్రిక్రాప్స్ విధానంలో పంటలు సాగుచేస్తే నిరంతరాయంగా ఆదాయం వస్తుంది. మూడు పంటలను ఒకేసారి సాగుచేస్తే మొదటగా 30 రోజుల్లో బెండ దిగుబడి వస్తుంది. దానిని అమ్ముకుంటే పత్తి, కంది పంటకు అవసరమైన పెట్టుబడి వస్తుంది. ఒక పంటకు ఎకరానికి రూ.10వేలు పెట్టుబడి పెడితే చాలు. దిగుబడి మాత్రం మూడు పంటల ద్వారా దాదాపు లక్ష రూపాయలకుపైగా ఆదాయం వస్తుంది.



– నెల్లికంటి రాఘవేంద్ర, రైతు, చల్మెడ

లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ అవార్డు అందజేత



అవార్డు అందుకుంటున్న శ్రీనివాసులు

శాలిగౌరారం : పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించిన శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన లయన్స్‌క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ బుడిగె శ్రీనివాసులుకు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320ఈ ఇసామి గ్యాట్ అవార్డు దక్కింది. సోమవారం హైదరాబాద్‌లోని కొంపల్లిలో జరిగిన లయన్స్ క్లబ్ గ్యాట్ సమావేశంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పీఐడీ సునీల్‌కుమార్, డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు, 320 ఎండీ చైర్‌పర్సన్ తీగల మోహన్‌రావు చేతులమీదుగా శ్రీనివాసులు అవార్డు అందుకున్నారు. శాలిగౌరారం లయన్స్ క్లబ్ ఏర్పడిన 2022–23 సంవత్సర కాలంలోనే అనేక కార్యక్రమాలు నిర్వహించడంతో అవార్డు దక్కింది. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు మారం వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దునుక వెంకన్న, ప్రతినిధులు చామల మహేందర్‌రెడ్డి, బచ్చు ఆంజనేయులు, గుండ్ల రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీఫాం అందుకున్న వేముల వీరేశం

నకిరేకల్ : నకిరేకల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం సోమవారం బీఫాం అందుకున్నారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఏఐసీసీ నేతలు ఆయనకు బీఫాం అందజేశారు.



బీఫాం అందుకుంటున్న వేముల వీరేశం

ఎన్నికల నిర్వహణపై శిక్షణ



పీఓ, ఏపీఓలకు శిక్షణ ఇస్తున్న వెంకటేశ్వర్లు

చండూరు : ఈ నెల 30న జరగనున్న పోలింగ్‌పై ప్రతి అధికారికి అవగాహన ఉండాలని ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రవీందర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మరియనికేతన్ పాఠశాలలో పీఓ, ఏపీఓలకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ముందుగా ఫారం 12 ద్వారా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈవీఎంల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గురువారావు, ట్రైనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.